
సాక్షి పల్నాడు

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



42.57 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 33,306 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 42.57 టీఎంసీలు.



పవిత్రోత్సవాలు ప్రారంభం

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురారోహణతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.



41,775 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,880 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,775 బస్తాలు విక్రయించారు.

పేద విద్యార్థులకు నష్టం



మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. వాటిని సీఎం చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. పేదలకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలి. ఎన్ఎంసీ అనుమతి ఇస్తే మాకు వద్దు, మేం అడ్మిషన్లు జరపలేం అంటున్న ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే. పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంది.

– సీహెచ్ సునీత,
నీట్ రాసిన విద్యార్థిని తల్లి



తీరని అన్యాయం..



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించటం విద్యార్థులకు అన్యాయం చేయటమే. సీట్లను అమ్ముకునేందుకే ఈ ఆలోచన చేస్తున్నారు. నీట్‌లో ర్యాంకులు సాధించిన వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. కేటగిరీల వారీగా సీట్లు కేటాయించటం ఒక తప్పయితే ప్రస్తుతం ప్రైవేటీకరించాలని ఆలోచన చేయటం విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేయటమే. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

– భోగాది ప్రేమిక శ్రీనాగ నిర్మల,
నీట్ రాసిన విద్యార్థిని, మచిలీపట్నం

ఆటల పండగకు వేళాయె

- పాఠశాలల క్రీడా మైదానాల్లో క్రీడల సందడి
- విద్యార్థులకు ఏడు అంశాల్లో ఎంపిక పోటీలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఎస్‌జీఎఫ్ అధికారులు



నందిగామలో క్రీడల్లో బాలికలు (ఫైల్)

సత్తెనపల్లి: జిల్లాలో చదువులతో కుస్తీ పడుతున్న బాల,బాలికలకు ఆటవిడుపు దొరికింది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల క్రీడా ప్రతిభ వెలికి తీసి వారిని ఆటల్లో అడుగులు వేయించే శిక్షణాలయాలు పాఠశాలలు. స్కూల్ మైదానంలో నేర్చుకునే క్రీడా మెలకువలు భవిష్యత్తులో ఉన్నతంగా రాణించడానికి సాయపడతాయి. ఈ నేపథ్యంలో క్రీడా మాణిక్యాలను ప్రోత్సహించేందుకు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి పోటీలు నిర్వహించేందుకు షెడ్యూల్ అధికారులు విడుదల చేశారు. ఇక్కడ విజయం సాధిస్తే నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ ధ్రువపత్రాలు క్రీడా కోటాలో ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర కోర్సుల్లో ఉన్నత చదువులకు సీట్లు పొందేందుకు తోడ్పడతాయి. మరి ఇంకెందుకు ఆలస్యం పిల్లలూ ప్రతిభకు సాన బెడదామా..

మండల, నియోజకవర్గ స్థాయిలో..

మండల, నియోజకవర్గ స్థాయిలో ఏడు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయి పోటీలు ఈ నెల 18 నుంచి 21 వరకు, నియోజకవర్గస్థాయి పోటీలు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. అండర్–14, అండర్–17 బాల, బాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌తోపాటు చదరంగం, యోగ అంశాలపై పోటీలు జరగనున్నాయి. ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయిలో పోటీపడే మండల జట్టుకు ఎంపిక చేస్తారు. అక్కడ రాణించిన వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు నియోజకవర్గ జట్టుకు ఎంపిక చేయనున్నారు.

అర్హులు ఎవరంటే...

అండర్–14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్–14, 17, విభాగాల్లో, ఇంటర్మీడియెట్ విద్య పరిధిలో అండర్–19 ఎంపికలు జరుగుతాయి. అండర్–14 విభాగంలో పాల్గొనే బాల, బాలికలు 2011 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలి.అండర్–17 విభాగంలో పాల్గొనే బాల,బాలికలు 2008 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన వారు అర్హులు. అండర్–19 పోటీలకు 2006 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలి. విద్యార్థులు అర్హతకు సంబంధించిన పత్రాలను ఎంపికకు హాజరయ్యే వారు తప్పని సరిగా తీసుకురావాల్సి ఉంది.



పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర్లు నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మండల, నియోజకవర్గ స్థాయి అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికల పోటీలు జరుగుతాయి.

–ఎస్.సురేష్‌కుమార్,
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, పల్నాడు

పారదర్శకంగా క్రీడా పోటీలు



విద్యార్థుల జీవితంలో కీలకమైన స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలను అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు కల్పించేలా మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పీడీలు పూర్తి చొరవ తీసుకోవాలి. పారదర్శకంగా ఎంపిక పోటీలు నిర్వహించి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలి.

–ఎం.వెంకటేశ్వర్లు,
జిల్లా విద్యాశాఖాధికారి, పల్నాడు

బాబ్బాబు.. కలుపుకొని పోండి

- జిల్లా అధ్యక్షుడి లేఖ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు అందజేసిన నాయకులు
- తమ పార్టీ నుంచి ఎటువంటి సూచన లేదని చెప్పిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే తీరుకు ఖంగుతిన్న బీజేపీ నాయకులు



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు జిల్లా అధ్యక్షుడు ఇచ్చిన లేఖను అందజేస్తున్న బీజేపీ నాయకులు

నరసరావుపేట: ప్రభుత్వ, ప్రైవేటు కార్యకలాపాలకు మిత్రపక్షమైన తమను కూడా ఆహ్వానించి తగిన గౌరవం ఇవ్వాలని బీజేపీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కోరిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే మిమ్మల్ని కలుపుకొని పోవాలంటూ తమ పార్టీ నుంచి ఎటువంటి సూచనలు అందలేదని, అవి రాగానే మీరు కోరిన విధంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన జవాబుతో బీజేపీ నాయకులు కంగుతిన్నట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలో తెదేపా బీజేపీ జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడిచినా కూడా ఇంత వరకు మిత్రపక్షమైన బీజేపీకి ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించకుండా జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు కూడా ఎటువంటి ఆహ్వానం లేకుండా వ్యవహరించటంపై ఆ పార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు. తాము తరచూ వెళ్లి ఎమ్మెల్యేను కలుస్తున్నప్పటికీ ఎటువంటి గౌరవం లభించడం లేదని వారు భావిస్తున్నారు. ఎమ్మెల్యే వ్యవహారంపై నలభై ఏళ్లుగా పార్టీకి అంకితమై పనిచేస్తున్న సీనియర్ నాయకులు తీవ్ర మనస్తాపానికి గురై తమ పార్టీ జిల్లా అధ్యక్షుడిని కలిసి తెలియజేశారు. అధ్యక్షుడు ఇచ్చిన ఒక లేఖను తీసుకొని గత మంగళవారం ముఖ్య నాయకులు అందరూ కలిసి ఎమ్మెల్యేకు అందజేశారు. నాకు మా పార్టీ నుంచి ఎటువంటి సూచన లేదని చెప్పటంతో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహానికి గురై అసంతృప్తితో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి వెనుతిరిగి వచ్చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నేషనల్ కౌన్సిల్ మెంబరు వల్లెపు కృపారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఇత్తడి కిరణ్, అసెంబ్లీ కో కన్వీనర్ కాటా అంజనారెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అమ్మజిలాని, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.సత్యానందబాబు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారావు ఉన్నారు. దీనిపై నేషనల్ కౌన్సిల్ మెంబరు వల్లెపు కృపారావును వివరణ కోరగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబును తాము కలిసి లేఖ ఇచ్చిన విషయం నిజమేనని అన్నారు. ఆయన గెలుపుకు తామందరమూ కృషిచేశామన్నారు. అయితే గెలిచిన దగ్గర నుంచి మాతో సంబంధం లేకుండా తాను గెలిచినట్లుగా ఉంటున్న ఎమ్మెల్యే తీరు బాధ కలిగిస్తుందన్నారు. కూటమి పక్షమైన తమను పట్టించుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

చీరాల టౌన్: స్ట్రయిట్ కట్ కరకట్టలపై అక్రమంగా ఇసుకను తవ్వి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా ఏఎస్పీ విఠలేశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం చీరాల మండలంలోని విజయలక్ష్మీపురం, బుర్లవారిపాలెంలోని స్ట్రయిట్ కట్ కరకట్ట వద్ద ఇసుక అక్రమంగా తవ్విన ప్రాంతాలను డీఎస్పీ జగదీష్‌నాయక్, తహసీల్దార్ గోపీకృష్ణ, డ్రైనేజీ ఏఈ పురుషోత్తంలతో కలిసి ఆయన పరిశీలించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కరకట్టలపై అక్రమంగా ఇసుకను తవ్వి, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ప్రభుత్వం సూచించిన స్టాక్ పాయింట్లలో నిబంధనల ప్రకారం ఇసుకను లోడ్ చేయించి, తగిన రశీదులతో రవాణా చేసుకోవాలన్నారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖలతో కలిసి సంయుక్తంగా 24 గంటలు తనిఖీలు చేస్తామన్నారు. కట్టల నుంచి ఇసుకను తరలించడం వల్ల భారీ వర్షాల సమయంలో స్ట్రయిట్ కట్ సమీపంలోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రూరల్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్సై శివకుమార్, ఆర్ఐ శేఖర్ ఉన్నారు.


న్యూస్‌రీల్

17న అంగన్‌వాడీలు, పాఠశాలల్లో డీవార్మింగ్

- 1–19 ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: బాలబాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపే నులి పురుగుల నివారణ కోసం ఈనెల 17న జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో డీవార్మింగ్ నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. సంబంధిత తేదీల్లో ఏఎన్ఎం సమక్షంలో పాఠశాలలు, అంగన్‌వాడీల్లోని 1 నుంచి 19 ఏళ్ల వారందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆ రోజున తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజున హాజరు కాని వారికి 20వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. నులిపురుగులను నివారించడంలో భాగంగా విద్యార్థులు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇంటి బయట తప్పనిసరిగా చెప్పులు వేసుకుని నడవడం వంటి అలవాట్లపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు పోషకాలు అందకుండా చేసే నులిపురుగులను నివారించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు.

కొండవీడు ఘాట్‌రోడ్డు పరిశీలన



నాదెండ్ల: యడ్లపాడు మండలం కొండవీడు ఘాట్ రోడ్డును శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి ఘాట్ రోడ్డుపై పడిన విషయం విదితమే. విరిగిపడిన కొండ రాళ్లను అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో తొలగించి పనులు పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయ్యాక కొండవీడు నగరవనానికి సందర్శకులను అనుమతించటం జరుగుతుందన్నారు. పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటూ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీరాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇది మహో కష్టం

వరద ప్రభావిత ప్రాంతం మహానాడులో ప్రజల ఇక్కట్లు



తడిసిపోయిన పుస్తకాలను ఆరబెడుతున్న మహిళ

తాడేపల్లి రూరల్: కృష్ణానది వరద ప్రభావం మహానాడు ప్రాంత ప్రజలకు తీరని నష్టాన్ని కలిగించింది. వరద తగ్గినప్పటికీ కష్టాలు తీరలేదు. ఇళ్లలోని పలు వస్తువులు పాడయ్యాయి. వాటి మరమ్మతుల కోసం భారీగా ఖర్చులు అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంటింటికీ నష్టం

వరదలకు మహానాడులో ఇంటింటికి నష్టం వాటిల్లింది. గృహోపకరణాలతోపాటు చెక్క వస్తువులు, తలుపులు, సోఫాలు పూర్తిగా పాడైపోయాయి. నివాసితులంతా రోజువారీ ఉపయోగించుకునే వస్తువులతోపాటు ఇంటి తలుపులు, కిటికీలు, మంచాలు మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఒక్కోదానికి రూ.2వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇంట్లో బాత్‌రూమ్ తలుపుకు మరమ్మతు చేయాలంటే మెటీరియల్‌తో కలిపి రూ.5 వేలు అవుతోంది. గుమ్మాలకైతే రూ.10 వేలు దాటుతోంది. ఇక సోఫాలు ఇతర చెక్క వస్తువులను బయట పడవేస్తున్నారు. వరద తాకిడికి నీళ్ల వెళ్లిన ప్రతి ఇంట్లో మరమ్మతుల నిమిత్తం రూ. 25 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖర్చు అవుతోంది. దాదాపు 2,700 ఇళ్లల్లోని సెప్టిక్ ట్యాంకుల్లోకి వరద నీరు చేరింది. వాటిని శుభ్రం చేయడానికి రూ. 2 వేల ఖర్చు అవుతోందని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివాసాలు కోల్పోయిన వారు వలస

ఇళ్లు పూర్తిగా పడిపోయిన వారు, పాక్షికంగా దెబ్బతిన్న వారి పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. పూర్తిగా ఇళ్లు నష్టపోయిన 16 మంది నివాసాలను ఖాళీ చేసి బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. స్వల్పంగా దెబ్బతిన్న ఇళ్లను సైతం పూర్తిగా పడవేసి నిర్మాణం చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం చొరవ చూపించి తమ స్థలాల్లో ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలని వరద బాధితులు కోరుతున్నారు.

కనీసం సమాచారం లేదు

గత 30 సంవత్సరాల నుంచి నివాసముంటున్నా తామెప్పుడూ ఇంత వరద చూడలేదని మహానాడు ప్రజలు పేర్కొంటున్నారు. చిన్నపాటి వరద వస్తే ముందస్తుగా అధికారులు సమాచారం ఇచ్చేవారని, అలాంటిది ఇంత భారీ వరద వస్తున్నా చెప్పకపోవడం వల్లే తమకు ఇంత నష్టం వాటిల్లిందని వాపోతున్నారు.

ఇంటి గోడలు పడిపోయాయి



మా మరిదితో కలసి ఇల్లు కట్టుకున్నాం. ఆయన ఇల్లు పూర్తిగా పడిపోయింది. దీంతో మా ఇంటిగోడలు కూడా బీటలు వారి, తలుపులు ఊడిపోయాయి. రెండు ఇళ్లు పడేసి మళ్లీ కట్టుకోవాలి. చిన్న ఇల్లు నిర్మించుకోవడానికే నానా కష్టాలు పడ్డాం. ఇప్పుడు ఇల్లు నిర్మించుకోవాలంటే నాలుగు లక్షలు ఖర్చు అవుతుంది. మాలాంటి వారికి ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి.

సయ్యద్ నగిరీబాయి



గోడ కూలడంతో రాళ్ల కింద సైకిళ్లు



కూలిన ఇంటి పైకప్పు, గోడలు

నిధులు వస్తేనే అభివృద్ధి పనులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- 15వ ఆర్థిక సంఘ నిధుల్లో కేటాయింపులు
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై జెడ్పీటీసీ సభ్యుల అసంతృప్తి
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై ఆవేదన
- టీడీపీ నాయకులే వేదికలు ఎక్కుతున్నారని విమర్శ
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సమస్యలు ఏకరువు పెట్టిన జెడ్పీటీసీ సభ్యులు



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా.

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే అభివృద్ధి పనులు చేపడతామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా చాంబర్‌లో ఆమె అధ్యక్షతన ప్రణాళిక-ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యంపై 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధుల్ని విడుదల చేస్తేనే అభివృద్ధి పనులు చేపట్టగలమని, ఇప్పటికే గతంలో చేసిన వాటికి బిల్లులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులకు ప్రాధాన్యత క్రమంలో పనులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల్ని పూర్తి చేయించాలని సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారుల్ని ఆదేశించారు.

జెడ్పీటీసీ సభ్యుల ఆవేదన

స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు తమ మండలాల్లో సమస్యలను చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాతోపాటు ప్రభుత్వ శాఖల అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. మండలాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారామని, ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన చెందారు.

జూన్‌లో జరిగిన పాఠశాలల ప్రారంభంలో విద్యాకానుక కిట్ల పంపిణీకి హెచ్‌ఎంలు, ఎంఈవోలు తమను ఆహ్వానించలేదని వాపోయారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తమకు సరైన గౌరవం దక్కడం లేదని తెలిపారు. భట్టిప్రోలు మండలంలో ఏర్పాటు చేసిన సీఎం కార్యక్రమానికి సైతం తనకు ఆహ్వానం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు వాపోయింది. దీనిపై హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఎంపీడీవోలతోపాటు ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని డెప్యూటీ సీఈవో జె.మోహనరావుకు సూచించారు.

టీడీపీ నాయకులకు పెద్దపీట

టీడీపీ పాలన మొదలైన తరువాత తమ పరిస్థితి మరీ ఘోరంగా మారిందని పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వెళ్లగక్కారు. తమను పక్కన పెట్టి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక టీడీపీ నాయకులే వేదికలపై ఎక్కుతున్నారని తెలిపారు. ఎంపీడీవోలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారుల సమక్షంలోనే టీడీపీ నాయకులకు పెద్దపీట వేసి, తమను అవమానిస్తున్నారని విమర్శించారు. భారీ వర్షాలకు గ్రామాల్లో రోడ్లు భారీగా దెబ్బతిన్నాయని, వాటికి తక్షణం మరమ్మతులు చేయించాలని కోరారు. కృష్ణానది వరద ప్రభావానికి గురైన లంక గ్రామాల్లో వరద నీరు వెళ్లపోయిన తరువాత కనీసం బ్లీచింగ్ చల్లే పరిస్థితి లేదని భట్టిప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు సమావేశం దృష్టికి తెచ్చారు. స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా వ్యవసాయంపై జరిగిన 3వ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై జరిగిన 5వ సమావేశానికి పిల్లా ఉమా ప్రణతి అధ్యక్షతన వహించారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, జెడ్పీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య, పక్కన పట్టణ ఎస్ఐ సంధ్యారాణి

సత్తెనపల్లి: వడ్డవల్లి ఆంజనేయస్వామి గుడి సమీపంలోని వినాయక మండపం వద్ద ఇరువురిపై కత్తులతో జరిపిన హత్యాయత్నం కేసులో ఆరుగురిని అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నట్లు పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సీఐ కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 11న అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద 21వ వార్డుకు చెందిన గొల్లపల్లి అచ్యుత్, గొల్లపల్లి జీవన్‌లు అతివేగంగా ద్విచక్రవాహనంపై హల్‌చల్ చేస్తున్నారు. మండపం వద్ద ఉన్న కరాటి వెంకటేష్,, రాచమంటి పవన్ కల్యాణ్‌లు అంత వేగంగా ఇక్కడ తిరగవద్దని, చిన్న పిల్లలు ఉంటారని, వారికి ఏదైనా జరుగుతుందని చెప్పగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత మరికొంతమందిని వెంట తీసుకుని వచ్చి గొడవపడ్డారన్నారు. వెంట తెచ్చుకున్న కత్తులతో అచ్యుత్, జీవన్‌లు పవన్ కల్యాణ్, వెంకటేష్‌లపై విచక్షణ రహితంగా దాడి చేశారు. వారికి గాయాలయ్యాయి. నిందితులైన మల్లెం వెంకటేష్, గురజాల విజయ్‌కుమార్‌లు పెద్దపెద్దగా కేకలు వేస్తూ ఎవర్నీ అడ్డు రాకుండా భయపెడుతుండగా గర్నెపూడి పవన్, దాసరి కోటేశ్వరరావు, ప్రవీణ్‌లు ఇష్టం వచ్చినట్లు కాళ్లతో తన్ని, చేతులతో దాడి చేశారు. కేకలు విని చుట్టుపక్కల జనం రాగా అక్కడి నుంచి పారిపోయారు. గాయాలపాలైన వారిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు ఆర్.పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితులైన గొల్లపల్లి అచ్యుత్, గొల్లపల్లి జీవన్, గర్నెపూడి పవన్, దాసరి కోటేశ్వరరావు, మల్లెం వెంకటేష్, గురజాల విజయ్ కుమార్‌లను శుక్రవారం అరెస్ట్ చేశారు. ప్రవీణ్ పరారీలో ఉన్నారు. అరెస్ట్ చేసిన ఆరుగురిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. హత్యాయత్నానికి ఉపయోగించిన రెండు కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరుచుకున్నారు. పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధననాథుడు



లక్ష్మీగణపతి అలంకారంలో స్థానిక బ్యాంకు బజారులోని విఘ్నేశ్వరుడు

రూ.8 లక్షలతో లక్ష్మీగణపతి అలంకారం

నకరికల్లు: శ్రీలక్ష్మీ గణపతి అలంకారంలో స్థానిక బ్యాంకుబజారులోని విఘ్నేశ్వరుడిని శుక్రవారం అలంకరించారు. గణేష్ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తూ స్వామి వారిని లక్ష్మీగణపతిగా అలంకరించారు. భక్తుల సహకారంతో రూ.500, రూ.200, రూ.100, రూ.50, రూ.10 కరెన్సీ నోట్లతో మొత్తం రూ.8లక్షలతో విశేషంగా అలంకరించారు. భక్తసంఘం ఆధ్వర్యంలో భజనా కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ప్రకాశం, పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రా

ప్రకాశంకు ఏడు, పశ్చిమగోదావరికి నాలుగు పాయింట్లు



సుమిత్(100 పరుగులు)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్ బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ప్రకాశం, పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్ మూడు వికెట్ల నష్టానికి 342 పరుగులతో శుక్రవారం మూడో రోజు బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 8 వికెట్లు నష్టానికి 531 పరుగుల చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని జీవీఎస్.సుమంత్ 68 బంతుల్లో 10 ఫోర్లు, ఐదు సిక్సర్లతో 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. జట్టులోని హరీష్ 89 పరుగులు సాధించాడు. అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

కొలిక్కిరాని షాపుల కేటాయింపు

- వాటా కోరుతున్న కూటమి కార్యకర్తలు
- కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఖాళీ చేయించిన అధికారులు
- రెండు నెలలుగా ఖాళీగా ఉన్న కాంప్లెక్స్
- మార్కెట్ యార్డు ఆదాయానికి గండి



ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్



మూసేసిన షాపుల ముందు మద్యం బాటిళ్లు, చెత్త

నరసరావుపేట: ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల కేటాయింపు వ్యవహారం కొలిక్కిరాలేదు. రెండు నెలలుగా షాపులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీని వలన మార్కెట్ యార్డుకు రావాల్సిన అద్దెలు రాక ఇప్పటికే సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. ఖాళీగా ఉన్న షాపులకు వేలం నిర్వహిస్తే వాటిలో పాల్గొని తమ సత్తా చూపించేందుకు జనసేన కార్యకర్తలు సిద్ధపడుతున్నారు. వివరాలను పరిశీలిస్తే..ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా మార్కెట్ యార్డు స్థలంలో 2011లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి దానికి శ్రీ కాసు వెంగళరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ అని కాంగ్రెస్ నాయకులు పేరు పెట్టారు. అప్పటి నుంచి వాస్తవానికి ఎవరు అధికారంలో ఉంటే వారికి చెందిన కార్యకర్తలకే షాపులు కేటాయిస్తున్నారు. 2014 నుంచి 19వరకు టీడీపీ వర్గీయులు ఆయా షాపులను చేజిక్కించుకొని వ్యాపారాలు నిర్వహించగా 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్ సీపీ వర్గీయులు షాపులు నిర్వహించారు. మొత్తం 38 షాపులు ఉండగా కింద భాగంలో 20 వరకు ఉన్నాయి. పైభాగంలో ఉన్న ఆరు షాపుల్లో సచివాలయాలు కొనసాగుతున్నాయి. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల వలన బస్టాండ్‌కు ఎదురుగా కిందనే ఉన్న షాపులకే డిమాండ్ అధికంగా ఉంది. కింది షాపులకు నెలకు రూ.3400, పై భాగంలో ఉన్న వాటికి నెలకు రూ.1750 అద్దెగా నిర్ణయించారు. ఆయా షాపులకు వేలం నామకే వాస్తేగా నిర్వహించి కేటాయిస్తారు. దక్కించుకున్న వారు కిందనున్న పది పన్నెండు షాపులను నెలకు రూ.15 వేల నుంచి రూ.30వేలకు అద్దెకు ఇచ్చుకుంటున్నారు. దీని వలన షాపులను దక్కించుకోవాలని కార్యకర్తలు ఆరాటపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే కాంప్లెక్స్‌లో అప్పటివరకు ఉన్నవారిని ఆఘమేఘాలపై ఖాళీ చేయించారు. వ్యాపారాలు లేక చెత్త చేరి కాంప్లెక్స్ కళ తప్పింది. రాత్రి సమయంలో మందుబాబులు మద్యం తాగేందుకు ఉపయోగించుకుంటున్నారు. రెండు షాపుల్లో అధికార టీడీపీ ముద్రతో వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకుల మధ్య వ్యవహారం చూస్తే ఎడమొఖం, పెడముఖంగా ఉంది. ఇరుపార్టీల నాయకులు ఒకే వేదికపై చాలా అరుదుగా కన్పిస్తున్నారు. దీంతో షాపుల వ్యవహారం తేలటంలేదు.

ఈనెలాఖరుకు వేలం నిర్వహిస్తాం

ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కు 2021లో చివరి సారిగా షాపులకు బహిరంగ వేలం వేసి కేటాయించారు. అప్పటి నుంచి ఉంటున్న వారు చెల్లించాల్సిన అద్దె బాకీ సుమారు రూ.15లక్షల వరకు ఉంది. నోటీసులు ఇచ్చాం. మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి వేలం ద్వారా కేటాయించేందుకు ఉన్నవారిని ఖాళీ చేయించాం. ఇంకా నలుగురైదుగురు ఖాళీ చేయాల్సివుంది. ఈనెలాఖరుకు నోటిఫికేషన్ విడుదల చేసి వేలం నిర్వహించి షాపులు కేటాయిస్తాం.

–వి.అంజనేయులు, యార్డు కార్యదర్శి

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

నేటి నుంచి ఉపాధ్యాయులకు పోటీలు



కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

నరసరావుపేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఆఫీసు బేరర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 1974 ఆగస్టు 10న ఏర్పాటైన యూనియన్ 50ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా డిసెంబరు నెలలో కాకినాడలో స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులకు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జీవో 117 రద్దు చేయకుండా చేసిన సర్దుబాటు బదిలీలు నిష్ప్రయోజనం అన్నారు. సర్దుబాటు పేరిట సుమారు 75 కిలోమీటర్ల దూరం వరకు బదిలీలు చేశారన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి జి.విజయసారథి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. శనివారం నుంచి మూడు రోజులపాటు పిడుగురాళ్ల, వినుకొండ, చిలకలూరిపేట, గురజాల, నరసరావుపేటల్లో ఉపాధ్యాయులకు క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, టెన్నీకాయిట్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి జె.వాల్యానాయక్ ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, ఏ.భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు, కె.అజయ్‌కుమార్, టి.వెంకటేశ్వర్లు, కె.ఉషాశౌరిరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య రాళ్ల దాడి

యద్దనపూడి: యద్దనపూడి మండలంలోని గురువారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు పోలీసుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. సూరవరపుపల్లి గ్రామంలో టీడీపీ వర్గానికి చెందిన వారు వినాయక నిమజ్జనం కోసం వెళ్తున్న సమయంలో కొందరు వైఎస్సార్ సీపీ వర్గీయులను దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో వివాదం జరిగింది. ఇరువర్గీయులను పోలీసులు కట్టడి చేశారు. ఈ ఘర్షణలో వైఎస్సార్ సీపీకి చెందిన సన్నెబోయిన వీరయ్య, సన్నెబోయిన వాసుకు గాయాలయ్యాయి. వీరు మార్టూరు, చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉందని ముందస్తు జాగ్రత్తగా పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ జీఎల్ శ్రీనివాసరావు, ఎస్సై రత్నకుమారి తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఇరు వర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏపీ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



గొల్లపల్లి నాగేశ్వరరావు

సత్తెనపల్లి: ఏపీ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణంలోని 19వ వార్డు కొత్తపేట భావనారుషినగర్‌కు చెందిన గొల్లపల్లి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావు శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నియామక పత్రాన్ని అందించారు. నాగేశ్వరరావు ఈనెల 11 నుంచి 2029 ఆగస్టు 10 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను నాగేశ్వరరావు అందేలా కృషి చేయగలరని విశ్వసిస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. నాగేశ్వరరావు నియామకం పట్ల పలువురు హర్షం వెలిబుచ్చారు.

17న బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికను ఈ నెల 17న స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1, 2009 తర్వాత జన్మించిన బాలురు పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన సూచించారు. ఆధార్‌తో పాటు ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, వైట్ డ్రెస్‌తో పాటు సొంత కిట్‌ను తీసుకురావాలని ఆయన తెలిపారు.

పార్వతీపుత్రా ..పాహిమాం

7వ రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



సత్తెనపల్లిలో 61 అడుగులు మట్టి వినాయకుడిని పూజిస్తున్న మహిళా భక్తులు

సత్తెనపల్లి: వినాయక నవరాత్రుల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జుననగర్‌లో గల శ్రీశ్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో వినాయక నవరాత్రులు కోలాహలంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా 7వ రోజు శుక్రవారం 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద గోత్ర నామాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీ సత్యసాయి యువజన సంఘం అధ్యక్షుడు సాయి తేజ రాజు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మండల, నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల షెడ్యూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈమేరకు మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆటల పోటీల షెడ్యూల్ వివరాలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. మండల స్థాయి పోటీలను ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయి పోటీలను ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి, నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయికి ఎంపిక చేయాల్సి ఉంటుందని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం, యోగ, బాడ్మింటన్ క్రీడలు, మిగిలిన క్రీడాంశాలలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. అండర్–14 విభాగంలో పాల్గొనే వారు 2011 జనవరి ఒకటో తేదీ తర్వాత, అండర్–17 విభాగంలో పాల్గొనే వారు 2008 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలన్నారు. విద్యార్థులు తమ అర్హతకు సంబంధించిన పత్రాలతో ఆటల పోటీలకు హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

వైద్యశాల ఎదుట నర్సింగ్ ఉద్యోగుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

నరసరావుపేట టౌన్: కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట నర్సులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో వల్ల ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నర్సుల నోటిఫికేషన్‌కు విఘాతం కలుగుతుందన్నారు. సచివాలయాల్లో ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా నియమించేందుకు నిర్ణయం తీసుకోవటం దారుణమన్నారు. జీఓ నెం.115ను రద్దు చేయటంతోపాటు నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు బి.నాగరాజి, ఎం.ఆదిలక్ష్మి, ఇందిర, బి.అరుణ, జి.మాణిక్యంలు పాల్గొనగా వీరికి నర్సింగ్ సూపరింటెండెంట్ జయకరుణ, హెడ్ నర్సులు కోటమ్మ, విజయకుమారి మద్దతు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో కొండమంజులూరు విద్యార్థిని ప్రతిభ



పంచుమర్తి భవ్యశ్రీ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

జే.పంగులూరు: జాతీయ స్థాయి పోటీల్లో కొండమంజులూరు విద్యార్థిని ప్రతిభ చాటింది. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టులో 'మోంట్రియల్ ప్రోటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. దీనికి సంబంధించిన ఫలితాలను శుక్రవారం ఢిల్లీలో ప్రకటించారు. బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని కొండమంజులూరు రావుల జానకీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పంచుమర్తి భవ్య ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం ఇమ్మిడి శెట్టి అనిత తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు సమష్టి కృషితో ఈ విజయాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గోలి సంధ్య, గ్రామ పెద్దలు చింతల సహదేవుడు, హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది, విద్యాశాఖ అధికారులు కే నాగభూషణం, వీరాంజనేయులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

బాలచాముండేశ్వరిదేవికి బంగారు హారం సమర్పణ



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రప్రథమ క్షేత్రమైన అమరావతిలోని బాల చాముండేశ్వరీదేవి అమ్మవారికి గుంటూరుకు చెందిన షిరిడి సాయిబాబా వెజిటబుల్స్ హోల్‌సేల్ మర్చంట్స్ అధినేత అడపా బృహస్పతిరావు, పార్వతి దంపతులు బంగారు హారాన్ని సమర్పించారు. శుక్రవారం దేవాలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మకు 39 గ్రాముల బరువు తో సుమారు రూ.2 లక్షల 30 వేల విలువైన బంగారం మామిడి పిందెల హారం అందజేశారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి విశేష కుంకుమార్చన నిర్వహించి బంగారు మామిడి పిందెల హారాన్ని అలంకరించా రు. ప్రత్యేక పూజల అనంతరం అడపా బృహస్పతిరావు, పార్వతి దంపతులకు స్వామివారి శేష వస్త్రాలను బహూకరించి, వేద ఆశీర్వచనం అందించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

18న రాష్ట్ర, జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర, జాతీయ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాల ఆటల పోటీల కార్యదర్శి ఈ చింపారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక కార్యక్రమం ఈ నెల 18వ తేదీన కందుకూరులో టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒంగోలులో ఏబీఎం జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్ తక్రా ఆటలకు సంబంధించి ఈ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్–14, 17, 19 విభాగాల్లో ఉంటాయన్నారు. విద్యార్థులు తమ పాఠశాల హెచ్‌ఎం, కళాశాల ప్రిన్సిపాల్ నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్, 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ వెంట తేవాలని కోరారు. వివరాలకు 98481 25706, 94406 21579 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు రద్దు

జే.పంగులూరు: ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పంగులూరు జూనియర్ కళాశాలలో జరగాల్సిన 34వ సబ్‌జూనియర్స్ బాల, బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రకృతి విపత్తులు, పలు రైళ్ల రద్దు కారణంగా రద్దు చేశారు. 13 జిల్లాల సంఘ కార్యదర్శుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన డైరెక్ట్ నేషనల్ సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు చొప్పున బాలురు, బాలికలు పాల్గొనాలని తెలిపారు. ఎంపికైన వారికి పంగులూరు జూనియర్ కళాశాలలో శిక్షణ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయని రాష్ట్రస్థాయి ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి, అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాశీవిశ్వనాథరెడ్డి, కే భాస్కర్ తెలిపారు.

రేపు ఆచార్య బేతవోలుకు జాతీయ సాహితీ పురస్కారం

గుంటూరు వెస్ట్: సంస్కృతి, అజో–విభొ–కందాళం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మానికి కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జాతీయ సాహితీ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు సత్రాజు బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వక్తలుగా పిన్నమనేని మృత్యుంజయరావు, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, వెలువోలు నాగరాజ్యలక్ష్మి తదితర ప్రముఖులు పాల్గొంటారని వెల్లడించారు.

సుబ్రహ్మణ్యం పిల్లల సంరక్షణకు చర్యలు

జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తమరావు



చినగంజాంలో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా అధికారులు

చినగంజాం: కన్నబిడ్డలను పోషించలేని స్థితిలో పసికందును సైతం విక్రయించేందుకు పూనుకున్న సుబ్రహ్మణ్యం కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన పిల్లల సంరక్షణకు ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పీ పురుషోత్తమరావు అన్నారు. చినగంజాం మండలంలోని జాలమ్మ కాలనీలో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం ఇంటికి జిల్లా బాలల సంరక్షణాధికారులు పీ పురుషోత్తమరావు, జీ కృష్ణ, ఇంకొల్లు ఐసీడీఎస్ సీడీపీఓ టీ ఝాన్సీ, సిబ్బంది శుక్రవారం వచ్చారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. పసికందును విక్రయించారనే విషయమై గుంటూరులో కేసు నమోదు కావడంతో గుంటూరు బాలల సంరక్షణ కేంద్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు విచారణ నిర్వహించారు. సుబ్రహ్మణ్యంతోపాటు ఆయన బంధువులు, ఇరుగుపొరుగు వారితో మాట్లాడారు. సుబ్రహ్మణ్యం దంపతుల ఎనిమంది మంది పిల్లలు ఎలా ఉన్నారు, వారి సంరక్షణ, స్థితిగతులు వంటి విషయాలను తెలుసుకున్నారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పీ పురుషోత్తమరావు తెలిపారు. సుబ్రహ్మణ్యం దంపతులకు ఇప్పుడు పుట్టిన పాపతో కలిపి 9 మంది సంతానం ఉన్నారు. వారిలో ఐదుగురు అమ్మాయిలు. పెద్దవారైన మగ పిల్లలు ఇద్దర్ని గొర్రెలు కాసే పనిలో కుదిర్చినట్లు గుర్తించారు. మిగిలిన ఇరువురు మగపిల్లలు తండ్రి వద్ద ఉంటున్నట్లు గుర్తించారు. గుంటూరు శిశు సంరక్షణ కేంద్రంలో పుట్టిన పాప ఉండగా, తండ్రి దగ్గర ఉన్న ఆడపిల్లల్లో పెద్దపాప మినహా ముగ్గుర్ని బాపట్ల జిల్లా శిశు సంరక్షణ కేంద్రం బాలికా సదన్‌లో చేర్పించాలని అధికారులు తండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బిడ్డల తల్లి లక్ష్మి అంత్యక్రియలు పూర్తయిన తరువాత కుటుంబ సభ్యులతో చర్చించుకొని వారిని చేర్పించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఇంకొల్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే వాణిశ్రీ, మహిళా సంరక్షణాధికారి నాయుడు మీనాక్షి, ఏఎస్ఎం జే సువార్త, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.హైమావతి, బీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియలో సంఘంపై తప్పుడు ఆరోపణలు

ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

గుంటూరు వెస్ట్: ఇటీవల పలు శాఖల్లో నిర్వహించిన ఉద్యోగుల బదిలీల్లో తమ సంఘంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. చాంద్ బాషా మాట్లాడుతూ తమ సంఘం ఎదుగుదలను తట్టుకోలేని కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఉద్యోగుల సంక్షేమం కోసం మాత్రమే పనిచేసే తమపై బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు. తమపై నిందలు వేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని, చట్టపరంగా శిక్షపడే వరకు పోరాడతామని తెలిపారు. తమ విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, విచారిస్తామని మాటిచ్చారని చెప్పారు.